సాక్షి పెద్దపల్లి

గురువారం । 1 । మే । 2025



విద్యార్థులకు అభినందన

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి పాఠశాలకు చెందిన జి.అక్షర 556, మరో 12మంది విద్యార్థులు టెన్త్‌లో 500పైగా మార్కులు సాధించడంతో జీఎం వెంకటయ్య అభినందించారు.



రిటైర్డ్ అధికారులకు సన్మానం

గోదావరిఖని: రిటైర్డ్ సీఐ కమలాకర్, ఏఆర్ ఎస్సై నర్సయ్య, సుందర్‌రావును సీపీ అంబర్ కిశోర్‌ఝా సన్మానించారు. ఎస్సైలుగా పదోన్నతి పొందిన వారికి చిహ్నం అలంకరించారు.

గరిష్ఠం/కనిష్ఠం

40.0/28.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఎండ తీవ్రత అధికంగా నమోదు అవుతుంది. పగలు ఉక్కపోతగా, అసౌకర్యంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్ సతీమణి ప్రసవం



శిశువుతో డాక్టర్ అమరేందర్‌రావు

ముత్తారం(మంథని): స్థానిక ప్రభుత్వ వైద్యుడు అమరేందర్ రావు సతీమణి దివ్య పెద్దపల్లిలోని సర్కారు ఆస్పత్రిలో మగ బిడ్డకు జన్మనిచ్చారు. ప్రభుత్వ ఆస్పత్రిలో పని చేస్తూ తమ భార్యకు ప్రసవం అయ్యేంత వరకూ పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యచికిత్సలు చేయించారు. బుధవారం వైద్యులు ఆమెకు ఆపరేషన్ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రిలో కూడా అన్ని సౌకర్యాలు ఉన్నాయని, ప్రసవం తర్వాత తన భార్య, బిడ్డ ఆరోగ్యంగా ఉన్నారని డాక్టర్ వివరించారు.

బాలికలదే హవా

- పదో తరగతిలో 96.89శాతం ఉత్తీర్ణత నమోదు
- రాష్ట్రస్థాయిలో జిల్లాకు 10వ స్థానం
- కేజీబీవీ, మైనార్టీ, రెసిడెన్షియల్ స్కూళ్ల సత్తా
- 45 ప్రభుత్వ పాఠశాలల్లో వందశాతం పాస్
- 2024తో పోల్చితే స్వల్పంగా పెరిగిన ఉత్తీర్ణత
- జూన్ 3 నుంచి 13 వరకు సప్లిమెంటరీ పరీక్షలు

సాక్షి, పెద్దపల్లి: పదో తరగతి వార్షిక పరీక్షల్లో జిల్లా విద్యార్థులు ఈసారి మెరుగైన ఫలితాలు సాధించారు. గతేడాది ఫలితాలతో పోల్చితే.. ఈసారి ఉత్తీర్ణత శాతం స్వల్పంగా పెరిగింది. అయితే, రాష్ట్రస్థాయిలో గతేడాది 8వ స్థానంలో ఉన్న జిల్లా.. ఈఏడాది 10వ స్థానానికి పడిపోయింది. ఎప్పటిలాగే ఫలితాల్లో బాలికల హవా కనిపించింది, గత మార్చిలో జరిగిన పదో తరగతి పరీక్షలకు మొత్తం 7,387మంది విద్యార్థులు హాజరుకాగా, అందులో 7,157 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇందులో బాలురు 96.11శాతం కాగా, బాలికలు 97.67శాతం నమోదు చేసి.. బాలుర కన్నా బాలికలు ముందు వరుసలో నిలిచారు.



విశ్వప్రియ



నిత్యామీనన్

45 ప్రభుత్వ పాఠశాలల్లో వందశాతం ఉత్తీర్ణత..

జిల్లాలోని 103 ప్రభుత్వ పాఠశాలల్లో 45 పాఠశాలలు పదో తరగతిలో 100శాతం ఉత్తీర్ణత నమోదు చేశాయి. ఏ ఒక్క పాఠశాలలోనూ జీరో ఉత్తీర్ణత నమోదుకాలేదు. జిల్లాలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల తరఫున పరిశీలిస్తే.. నిట్టూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని కె.నిత్యామీనన్ 584 మార్కులు సాధించగా, కేజీబీవీ నుంచి 580 మార్కులతో సిరిపురం శ్రీజ, ఎస్.వర్షిత అత్యధిక మార్కులు సాధించారు. నందీమేడారం సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థి నవిత 568 మార్కులతో టాపర్‌గా నిలవగా, అంతర్గాం మోడల్ స్కూల్ విద్యార్థిని పిట్టల శ్రీవల్లి 569, మైనార్టీ రెసిడెన్షియల్ నుంచి విశ్వశ్రీ 586 మార్కులు సాధించారు.

జూన్ 3 నుంచి సప్లిమెంటరీ..

రీ వాల్యుయేషన్ కోసం దరఖాస్తు చేసుకునే విద్యార్థులు 15రోజుల్లోగా ట్రెజరీ చలానా తీసుకుని హాల్‌టికెట్లు జతచేసి సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సంతకం చేయించి జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయ పరీక్షల విభాగంలో సమర్పించాలని అధికారులు సూచించారు. పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 3 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించనున్నారని పేర్కొన్నారు. పరీక్ష ఫీజును మే 16 లోగా, అపరాధ రుసుంతో మే 18వ తేదీ వరకు చెల్లించే వీలుందని అధికారులు వివరించారు.

ఈఏడాది పదో తరగతి ఫలితాలు

విద్యార్థులు	బాలురు	బాలికలు	మొత్తం
హాజరైనవారు	3,698	3,689	7,387
ఉత్తీర్ణులైనవారు	3,554	3,603	7,157
ఉత్తీర్ణత శాతం	96.11	97.67	96.89

మూడేళ్ల ఫలితాలు ఇలా..

సంవత్సరం	2023	2024	2025
ఉత్తీర్ణత శాతం	95.34	96.32	96.89
రాష్ట్రంలో ర్యాంక్	9	8	10

శ్రమించారు.. విజయం సాధించారు

- టెన్త్ ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల హవా
- 550కి పైగా మార్కులు సాధించిన పేదింటి పిల్లలు



అశ్విత



శ్రీవల్లి



ఎస్.వర్షిత



శ్రీజ



బి.తన్మయి



శ్రీవరుణ్

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి సత్తా చూపారు. ఆయా మండలాల్లో టాపర్‌గా నిలిచి ఔరా అనిపించారు. మొత్తం 600 మార్కులకు 550కిపైగా మార్కులు సాధించిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు. ప్రత్యేక తరగతుల నిర్వహణ, సందేహాల నివృత్తిలో ఉపాధ్యాయులు ఇచ్చిన ప్రోత్సాహం, నిరంతరం చదవడం ద్వారా తామీ ఫలితాలు సాధించినట్లు విద్యార్థులు తెలిపారు. వీరంతా పేద కుటుంబాలకు చెందిన వారే కావడం గమనార్హం. జూలపల్లి మండలంలోని ప్రభుత్వ పాఠశాలకు చెందిన పాటకుల అశ్విత 568 మార్కులు సాధించింది. అదేవిధంగా రామగుండం మండలం లింగాపూర్ మోడల్ స్కూల్‌కు చెందిన పిట్టల శ్రీవల్లి 569, రామగిరి మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయానికి చెందిన సిరిపురం శ్రీజ, ఎస్.వర్షిత 580, కమాన్‌పూర్ మండలం జూలపల్లి ప్రభుత్వ పాఠశాలకు చెందిన వైద్య శ్రీవరుణ్ 572, ఓదెల మోడల్ స్కూల్‌కు చెందిన బి.తన్మయి 561, కాల్వ శ్రీరాంపూర్ మండలం మల్యాల మోడల్ స్కూల్‌కు చెందిన సహస్ర వర్షిణి 564 మార్కులు సాధించారు.

మేనేజ్‌మెంట్ వారీగా ఫలితాలు

పాఠశాలలు	హాజరు	పాసైంది	ఉత్తీర్ణత శాతం
బీసీ సంక్షేమ శాఖ	328	324	98.7
ప్రభుత్వ పాఠశాలలు	101	90	89.1
కస్తూరిబా గాంధీ బాలికలు	423	420	99.29
తెలంగాణ మోడల్ స్కూళ్లు	555	543	97.83
ప్రైవేట్ పాఠశాలలు	3,010	2,959	98.30
రెసిడెన్షియల్ స్కూళ్లు	69	69	100
మైనార్టీ రెసిడెన్షియల్	133	133	100
సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్	452	449	99.33
జెడ్పీ హైస్కూళ్లు	2,316	2,170	93.69
మొత్తం	7,387	7,157	96.88

ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

ధర్మారం(పెద్దపల్లి): ధాన్యంలో నిర్దేశిత తేమశాతం వచ్చిన వెంటనే తూకం వేసి రైస్‌మిల్లులకు తరలించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. దొంగతుర్తి, ఖిలావనపర్తి, సాయంపేట, నందిమేడారంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలతోపాటు నందిమేడారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, ఖిలావనపర్తి పల్లె దవాఖానాను కలెక్టర్ బుధవారం తనిఖీ చేశారు. ధాన్యం తరలించేందుకు అవసరమైన లారీలను అందుబాటులో ఉంచాలన్నారు. ప్రతీ గర్భిణి వివరాలను నమోదు చేయాలని, బీపీ, మధుమేహం బాధితులకు మందులు పంపిణీ చేయాలన్నారు. అనంతరం బంజేరుపల్లిలో పైలెట్ ప్రాజెక్టు కింద చేపట్టిన 71 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రగతిపై ఆరా తీశారు. ఏఎంసీ చైర్మన్ రూప్లానాయక్, వైస్ చైర్మన్ లింగయ్య, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.

ఆస్పత్రులపై దాడులు చేస్తే సహించేది లేదు

- రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ హెచ్చరిక



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: ప్రభుత్వ వైద్యాధికారులు, ప్రైవేట్ ఆస్పత్రులు, మెడికల్ షాపులపై దాడులు చేస్తే సహించేది లేదని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ హెచ్చరించారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైద్యులు దైవంతో సమానమని, అలాంటి వారిపై దాడులు చేస్తే వైద్యానికి దూరమవుతామన్నారు. తక్కువ ఫీజుతోనే వైద్యం అందించే మంచి డాక్టర్లు ఉన్నారని ఆయన తెలిపారు. రామగుండాన్ని మెడికల్ హబ్‌గా మార్చాలనే ప్రయత్నంలో ప్రభుత్వ డాక్టర్లు ప్రైవేట్ ఆస్పత్రులు నిర్వహిస్తున్నారని తెలిపారు. మీడియా పేరిట వారిని బ్లాక్ మెయిల్ చేస్తే ఊరుకునేది లేదని మక్కాన్‌సింగ్ హెచ్చరించారు. ఐఎంఏ అధ్యక్షుడు క్యాస శ్రీనివాస్, మాజీ మేయర్, బంగి అనిల్‌కుమార్, డాక్టర్లు నాగిరెడ్డి, లక్ష్మీవాణి పాల్గొన్నారు.

కార్మికవాడల్లో బీటీ రోడ్ల ఆధునికీకరణ

కార్మిక వాడల్లో బీటీ రోడ్లకు మహర్దశ పడుతోందని ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ అన్నారు. ఆర్జీ–1 ఏరియాలోని సింగరేణి కార్మిక వాడల్లో బీటీ రోడ్డు పనులను జీఎం లలిత్‌కుమార్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. రూ.5 కోట్ల సింగరేణి నిధులతో 23 కి.మీ. పొడవున తారురోడ్ల ఆధునికీకరణ పనులు ప్రారంభమయ్యాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ డీజీఎం కిరణ్ బాబు, సివిల్ ఎస్ఈ వరప్రసాద్, ఈఈ వసంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి రైల్వే లెవల్ క్రాసింగ్ గేట్ మూసివేత

పెద్దపల్లిరూరల్: కొత్తపల్లిలోని 37వ నంబరు లెవల్‌క్రాసింగ్ గేట్ మూసివేతకు రైల్వే ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. దీంతో బుధవారం గేట్‌ను మూసిఉంచారు. రైల్వేగేట్‌తో అవసరం లేకుండా.. రాకపోకలు సాగించేలా అధికారులు అండర్‌బ్రిడ్జి నిర్మించి అందుబాటులోకి తీసుకొచ్చారు. అయితే అండర్ బ్రిడ్జి ద్వారా తమ పంట పొలాలకు వెళ్లాలన్నా, పనుల కోసం జిల్లా కేంద్రం, ఇతర ప్రాంతాలకు వెళ్లాలన్నా దూరభారం అవుతోందని గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. రైల్వే అధికారులు తమ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని బాలసాని లెనిన్, కలవేన రాజయ్య, పల్లె సదానందం, షుకూర్, శ్రీనివాస్, సతీశ్, అశోక్, సుందర్, సాయి, రాజేందర్, ప్రతాప్, అరుణ్, శంకర్ తదితరులు డిమాండ్ చేశారు. దూరభారమే కాకుండా వానాకాలంలో భూగర్భ వంతెనలోకి వరదనీరు వచ్చిచేరి రాకపోకలకు అంతరాయం కలుగుతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు.



నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు

గోదావరిఖని: నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, రోడ్డు ప్రమాదాలు తగ్గించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా సూచించారు. సీపీ కార్యాలయంలో బుధవారం పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల పోలీసు అధికారులతో వివిధ అంశాలపై సమీక్షించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు రోడ్డు సేఫ్టీ విభాగంతో కలిసి పనిచేయాలన్నారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో విలేజ్, టౌన్ సేఫ్టీ కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. దొంగతనాల నియంత్రణకు విజబుల్ పోలీసింగ్ నిర్వహించాలన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం చేసేలా చూడాలన్నారు. పోలీస్ శాఖ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ప్రవర్తిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి రవాణా, తాగే వారిపై కేసులు నమోదు చేయాలని సూచించారు. మంచిర్యాల, పెద్దపల్లి డీసీపీలు భాస్కర్, కరుణాకర్, అడిషనల్ డీసీపీ(అడ్మిన్) రాజు, స్పెషల్ బ్రాంచ్, మంచిర్యాల, పెద్దపల్లి, జైపూర్, బెల్లంపల్లి, ట్రాఫిక్ ఏసీపీలు రాఘవేంద్రరావు, ప్రకాశ్, కృష్ణ, వెంకటేశ్వర్లు, రవి కుమార్, నర్సింహులు పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం



ఎక్లాస్‌పూర్‌లో ధ్వంసమైన ఇంటి పైకప్పు

మంథని: డివిజన్‌లో బుధవారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. మంథని పట్టణంతో పాటు ఆయా మండలాల్లో రోడ్లపై చెట్లు విరిగిపడి వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగించింది. ఎక్లాస్‌పూర్ గ్రామపంచాయతీ పరిధిలోని శాస్త్రుల్లపల్లి గ్రామంలో రెండు ఇళ్ల పైకప్పులు ఎగిరిపోయాయి. చెట్లు విరిగిపడడంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

క్లుప్తంగా

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం కొల్వాయి గ్రామానికి చెందిన ఆకుల చిన్న గంగన్న (55) బుధవారం పొలం వద్ద ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై కుమారస్వామి కథనం ప్రకారం.. గంగన్న ఏడాది క్రితం చెట్టుపై నుండి కింద పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాడు. అయినా శరీరంలో విపరీతమైన నొప్పులు ఉండడంతో అసౌకర్యానికి గురవుతున్నాడు. మందులు వాడినా నొప్పులు తగ్గడంలేదు. జీవితంపై విరక్తి చెంది ఉదయం పొలం వద్దకు వెళ్తున్నానని చెప్పి బయటకు వెళ్లాడు. పొలం వద్ద చెట్టుకు ఉరేసుకున్నాడు. గంగన్న భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి తరలిస్తున్న యువకుడి అరెస్ట్

కథలాపూర్: మండలకేంద్రానికి చెందిన కల్లెడ జైపాల్ అక్రమంగా గంజాయి తరలిస్తూ విక్రయిస్తున్న క్రమంలో పట్టుకుని అరెస్ట్ చేసినట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. జైపాల్ గంజాయిని కోరుట్ల, కథలాపూర్ ఏరియాలో విక్రయిస్తున్నాడనే సమాచారం మేరకు మెట్‌పల్లి డీఎస్పీ రాములు, కోరుట్ల సీఐ సురేశ్‌బాబు పర్యవేక్షణలో మంగళవారం రాత్రి తనిఖీ చేపట్టగా సిరికొండ శివారులో పట్టుబడ్డాడు. అతడి నుంచి 96 గ్రాముల గంజాయి, బైక్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

స్వగ్రామానికి చేరిన గల్ఫ్ మృతదేహం


గుంట హన్మంతు (ఫైల్)

కథలాపూర్(వేములవాడ): మండలంలోని పోసానిపేటకు చెందిన గుంట హన్మంతు(42) సౌదీ అరేబియాలో రెండు నెలల క్రితం హత్యకు గురికాగా.. ఆయన మృతదేహం బుధవారం స్వగ్రామానికి చేరింది. హన్మంతు కొన్నేళ్లుగా ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్తున్నాడు. తాను ఉంటున్న గదిలో నిజామాబాద్ జిల్లా మెండోరా గ్రామానికి చెందిన వ్యక్తితో ఫిబ్రవరి 28న గొడవ చోటుచేసుకుంది. ఈ ఘటనలో హన్మంతు కత్తిపోట్లకు గురై మృతిచెందాడు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మల్యాల: మండలంలోని జగిత్యాల–కరీంనగర్ జాతీయ రహదారిపై బుధవారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో జగిత్యాలకు చెందిన వేల్పుల మార్క్ (21) దుర్మరణం పాలయ్యాడు. ఎస్సై నరేశ్ కథనం ప్రకారం.. మార్క్ జగిత్యాల నుంచి వేములవాడ వైపు బైక్‌పై వెళ్తున్నాడు. మల్యాల క్రాస్‌రోడ్ వద్దకు రాగానే కరీంనగర్ నుంచి జగిత్యాల వైపు వెళ్తున్న టాటా ఏస్ వాహనం ఢీకొంది. ఈ ఘటనలో మార్క్ తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని 108 లో జగిత్యాల ఆస్పత్రికి.. అక్కడి నుంచి హైదరాబాద్ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మార్క్ తండ్రి పోచయ్య ఫిర్యాదు మేరకు ఆటో డ్రైవర్ కోన శ్రీనివాస్‌పై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

పోగొట్టుకున్న బ్యాగ్ అప్పగింత


ప్రయాణికురాలికి బ్యాగ్ అందిస్తున్న ఆర్టీసి సిబ్బంది

జగిత్యాలటౌన్: జగిత్యాల నుంచి వరంగల్ వెళ్తున్న ఓ ఆర్టీసీ బస్సులో ఓ ప్రయాణికురాలు పోగొట్టుకున్న బ్యాగ్‌ను తిరిగి ఆమెకు అప్పగించారు సిబ్బంది. జగిత్యాల డిపోకు చెందిన బస్సులో వరంగల్‌కు చెందిన సులోచన కరీంనగర్‌లో ఎక్కింది. తులం బంగారం, సెల్‌ఫోన్, డబ్బులు ఉన్న బ్యాగ్ ను బస్సులో మరిచిపోయి దిగిపోయింది. బస్ కండక్టర్ గంగప్రసాద్ ఆ బ్యాగ్‌ను గుర్తించి జగిత్యాల డిపోలో అప్పగించారు. ఇంటికెళ్లిన ప్రయాణికురాలు బ్యాగ్ పోగొట్టుకున్న విషయాన్ని గుర్తించి టికెట్ ఆధారంగా జగిత్యాల డిపోకు చేరుకుంది. అన్ని ఆధారాలను పరిశీలించిన ఆర్టీసీ సిబ్బంది ఆ బ్యాగును ఆమెకు అందించారు. బ్యాగును అందించిన కండక్టర్ గంగప్రసాద్, సిబ్బందికి సులోచన ధన్యవాదాలు తెలిపారు. డిపో క్లర్క్ మొండయ్య తదితరులు ఉన్నారు.



ఇతను సయ్యద్ అబ్దుల్(53). సిరిసిల్ల పట్టణ శివారులోని పెద్దూరుకు చెందిన అబ్దుల్‌కు ఇద్దరు పిల్లలు. చిన్నప్పటి నుంచి బండలు కొడుతున్నాడు. ఉపాధి కోసం రూ.లక్ష అప్పులు సౌదీ అరేబియా వెళ్లాడు. ఏం లాభం లేదు. అప్పులు తీరాక ఇల్లు చేరాడు. నాలుగేళ్ల క్రితం బండలు కొడుతున్నప్పుడు రాయి ఎగిరి వచ్చి ఎడమ కన్నుకు తాకింది. ఆస్పత్రికి వెళ్లితే కన్ను పోయిందన్నారు. రూ.50వేల వరకు ఖర్చు అయ్యాయి. ఇప్పుడు ఒంటి కన్నుతో బండలు కొడుతున్నాడు. ఇతని ఆసరా పెన్షన్ రాలేదు.



ఇతను షేక్ ఇబ్రహీం(38). సిరిసిల్ల శివారులోని తుర్కాశీకాలనీకి చెందిన ఇబ్రహీం భార్య పేరు రుక్సానా. వీరికి ముగ్గురు కొడుకులు. 13 ఏళ్ల కిందట బండలు కొడుతుండగా రాయి తగిలి కన్ను పోయింది. రూ.15వేల వరకు ఖర్చు అయింది. ఒక్క కన్ను లేకున్నా బండలు కొడుతూ రోజుకు రూ.500 వరకు సంపాదిస్తున్నారు. ఇబ్రహీంకు దివ్యాంగుల సర్టిఫికెట్ లేదు. ఆసరా పెన్షన్ రాదు.



ఇతను సయ్యద్ ఇబ్రహీం(25). పెద్దూరుకు చెందిన ఇబ్రహీం 9వ తరగతి చదివాడు. రెండేళ్లపాటు దుబాయ్ వెళ్లి వచ్చాడు. మళ్లీ బండలు కొడుతున్నాడు. రోజుకు రూ.500 వరకు సంపాదిస్తూ.. కుటుంబానికి ఆసరా అవుతున్నాడు. ఇలా ఒక్కరు ఇద్దరు కాదు.. రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా 5వేల మంది తుర్కాశీ కార్మికులు నిత్యం కండలు కరిగిస్తూ.. బండలు కొడుతూ జీవిస్తున్నారు. కానీ వారికి కార్మికచట్టాలు.. హక్కులు తెలియవు. అసంఘటితంగా ఉంటూ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారు.

‘బండ’బారిన బతుకులు

కండలు కరిగించినా.. కొండలు పగులదీసినా..

- కుండలో మెతుకులు కరువు
- కష్టజీవులకు దక్కని హక్కులు
- ప్రమాదబీమా ఊసేలేదు
- రెక్కాడితే తప్ప డొక్కాడని తుర్కాశీ కార్మికులు

సిరిసిల్ల: కండలు కరిగించి.. గుట్టలను పిండి చేస్తున్నారు. ఎండ..వాన..చలి.. లెక్కచేయని తనంతో కష్టపడుతున్నారు. అయినా పూటగడవని స్థితిలో తుర్కాశీలు కాలం వెల్లదీస్తున్నారు. భవన నిర్మాణాలకు బండలను సరఫరా చేస్తున్నా వారికి కనీసం కార్మికులుగా గుర్తింపుకార్డులు లేవు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడం లేదు. బండలు కొడుతూ ‘బండ’బారిన జీవనం గడుపుతున్న తుర్కాశీలపై మేడే సందర్భంగా ప్రత్యేక కథనం.


వెంకటాపూర్ శివారుల్లో బండలు కొడుతున్న తుర్కాశీ కార్మికులు


బండలను పగులగొడుతున్న తుర్కాశీ కార్మికులు


కార్మికులు పగులగొట్టిన బండలు

రాజన్నసిరిసిల్ల జిల్లాలో 82 గ్రామాల్లో..

రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా 82 గ్రామాల్లో తుర్కాశీ కార్మికులు ఉన్నారు. వీరంతా నిత్యం గుట్టలు, గుట్టబోరును నమ్ముకుని బండలు కొడుతున్నారు. భవన నిర్మాణాలకు, ప్రహరీలకు, పునాదుల నిర్మాణాలకు బండలను సరఫరా చేస్తారు. ఎంతో కష్టతరమైన పనిలో రెక్కలు ముక్కలు చేసుకుంటున్నారు. కండలు కరిగించి కొండలు పగలదీసినా ఇంట్లో కుండలు వెలితిగానే ఉంటున్నాయి. ఎదుగుబొదుగు లేని జీవితంతో బతుకు జట్కాబండిని భారంగా ఈడుస్తున్నారు. రెక్కాడితే కానీ డొక్కాడని దైన్యం ఇంకా వెంటాడుతూనే ఉంది. ఎండా, వాన, చలి ఇవేవి వాళ్లని భయపెట్టవు... రేపటికి పని దొరక్కపోతే ఎలాగన్న వేదన తప్ప... పండుగ పబ్బాలకు పరమాన్నం రుచి ఎరుగరు. జిల్లాలో అట్టడుగు స్థాయిలో జీవిస్తున్న తుర్కాశీల బతుకుచిత్రం దుర్భరం. అటవీ ప్రాంతాల్లో పనిచేయడంతో ఫారెస్ట్ అధికారులు బండలు కొట్టవద్దని పనిముట్లను లాకెళ్తున్నారని కార్మికులు వాపోయారు. రెక్కల కష్టాన్ని నమ్ముకున్న కార్మికుల బతుకులు బండలవుతున్నాయి.

గుర్తింపు లేదు

తుర్కాశీ కార్మికులను భవన నిర్మాణరంగ కార్మికులుగా గుర్తించి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించాల్సి ఉండగా.. కార్మికశాఖ వారిని పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. భవన నిర్మాణానికి అవసరమైన బండలను కొట్టి సరఫరా చేస్తున్నా గుర్తింపుకార్డులు, భవన నిర్మాణ కార్మికులుగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు దక్కడం లేదు. ఇప్పటికైనా జిల్లా అధికారులు చొరవచూపి జిల్లాలోని తుర్కాశీ కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

దరఖాస్తు చేసుకుంటే గుర్తింపు కార్డులు ఇస్తాం

భవన నిర్మాణ కార్మికులుగా తుర్కాశీ కార్మికులను గుర్తిస్తాం. తుర్కాశీ కార్మికులు దరఖాస్తు చేసుకుంటే గుర్తింపు కార్డులు జారీ చేస్తాం. ఇప్పటికే జిల్లాలో చాలా మందికి గుర్తింపు కార్డులు ఇచ్చాం. ఇంకా ఎవరైనా గుర్తింపు కార్డులు లేనివారు ఉంటే కార్మిక శాఖ ఆఫీస్‌ను సంప్రదిస్తే జారీ చేస్తాం. – నాజర్ అహ్మద్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్, సిరిసిల్ల

పిచ్చికుక్కల దాడిలో బాలుడికి తీవ్రగాయాలు

- వరంగల్ ఎంజీఎంకు తరలింపు


కుక్కలదాడిలో గాయపడిన బాలుడు

ఇల్లందకుంట(హుజూరాబాద్): పిచ్చికుక్కల దాడిలో బాలుడికి తీవ్రగాయాలు అయిన ఘటన బుధవారం మండలంలోని కనగర్తిలో జరిగింది. గ్రామానికి చెందిన రాజు–వనిత దంపతుల కుమారుడు రెండేళ్ల అయాన్ ఆరుబయట ఆడుకుంటున్న సమయంలో ఒక్కసారిగా పిచ్చికుక్కలు దాడి చేశాయి. అప్రమత్తమైన తల్లిదండ్రులు బాలుడిని హుజూరాబాద్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. కాగా, గతంలో కూడా గ్రామంలో పలువురిపై కుక్కలు దాడిచేశాయని, సంబంధిత అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ గడువు పొడిగింపు

కోల్‌సిటీ(రామగుండం): లేఅవుట్ల క్రమబద్ధీకరణ(ఎల్‌ఆర్‌ఎస్)కు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన వన్‌టైన్ సెటిల్‌మెంట్ పథకం(ఓటీఎస్) బుధవారంతో ముగిసింది. ఈ నేపథ్యంలో మే 3వ తేదీ వరకు గడువును పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ సెక్రటరీ టీకే శ్రీదేవి ఉత్తర్వులను జారీచేశారు. ఎల్‌ఆర్‌ఎస్ ఫీజుపై 25 శాతం రాయితీతో చెల్లింపు గడువు తొలుత మార్చి 31తో ముగియగా, తర్వాత ఏప్రిల్ 30వ తేదీ వరకు పొడిగించింది. మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల వెరిఫికేషన్ పూర్తయితేనే దరఖాస్తుదారులు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. కానీ వివిధ స్థాయిలో వెరిఫికేషన్ పెండింగ్ ఉండడంతో ఫీజు జనరేషన్ కావడం లేదు. దీనికితోడు కొన్నిసాంకేతిక సమస్యలతో కూడా దరఖాస్తుదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో మరోమూడు రోజులపాటు గడువు పొడిగించడంపై రామగుండం నగరపాలక సంస్థతోపాటు పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని మున్సిపాలిటీల్లో ఫీజు చెల్లించడానికి ముందుకు వచ్చే దరఖాస్తుదారులకు కొంత ఊరట లభించినట్లయ్యింది.

కరీంనగర్‌లో ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటు చేయండి

- అంబేడ్కర్ స్టేడియానికి సింథటిక్ ట్రాక్ మంజూరు చేయండి
- కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి మన్సూక్ మాండవీయకు బండి సంజయ్ వినతి

కరీంనగర్‌టౌన్: జిల్లా కేంద్రంలో ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటు చేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ బుధవారం కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్సూక్ మాండవీయకు మరోసారి విజ్ఞప్తి చేశారు. అంబేడ్కర్ స్టేడియంలో రూ.10 కోట్ల వ్యయంతో సింథటిక్ ట్రాక్ ఏర్పాటు చేయాలన్నారు. శాతవాహన వర్సిటీలో ×ఖేలో ఇండియా కింద మల్టీపర్పస్ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. న్యూఢిల్లీలో మన్సూక్ మాండవీయను కలిసిన బండి సంజయ్.. మూడు అంశాలపై చర్చించారు. కరీంనగర్‌లో ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటు అనివార్యమని బండి అన్నారు. మెడికల్ హబ్‌గా మారిన నగరానికి ఉత్తర తెలంగాణ జిల్లాల నుంచి అత్యధిక మంది ప్రజలు వైద్యం కోసం వస్తున్నారని, బీడీ, నేత కార్మికులతోపాటు వివిధ రంగాల్లో కార్మికుల సంఖ్య అధికంగా ఉందన్నారు. ఈఎస్ఐ సౌకర్యం లేక వారందరు వైద్య చికిత్సకు నోచుకోవడం లేదన్నారు. అదేవిధంగా నగరంలోని అంబేడ్కర్ స్టేడియానికి నిత్యం వేలాది మంది వస్తుంటారని, వారికోసం సింథటిక్ ట్రాక్ ఏర్పాటు చేయాలని బండి కోరారు. ఖేలో ఇండియా పథకం కింద శాతవాహన వర్సిటీలో రూ.16 కోట్ల వ్యయంతో మల్టీ పర్పస్ హాల్ ఏర్పాటుకు అధికారులు ప్రతిపాదనలు రూపొందించి కేంద్రప్రభుత్వానికి పంపారని గుర్తుచేశారు. స్పందించిన స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు ఇటీవల వర్సిటీని సందర్శించి మల్టీపర్పస్ హాల్ సాధ్యాసాధ్యాలపై నివేదిక రూపొందించి కేంద్రానికి పంపారని గుర్తుచేశారు. సానుకూలంగా స్పందించిన కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్సూక్ మాండవీయ.. ఈఎస్ఐ ఏర్పాటు ప్రతిపాదనలను ప్రధానమంత్రి కార్యాలయానికి పంపామని, ఆమోదం లభించిన వెంటనే ఏర్పాటు చేస్తామన్నారు. అంబేడ్కర్ స్టేడియంలో సింథటిక్ ట్రాక్, శాతవాహన వర్సిటీలో మల్టీపర్పస్ హాల్ ఏర్పాటు అంశాలను త్వరితగతిన పరిశీలించి సానుకూల నిర్ణయం తీసుకోవాలని సంబంధిత అధికారులను కేంద్ర మంత్రి ఆదేశించారు.


మన్సూక్ మాండవీయతో బండి సంజయ్‌కుమార్

అప్పు తీసుకున్న వారు మోసం చేశారని..

- పోలీస్‌స్టేషన్‌లో మహిళ ఆత్మహత్యాయత్నం
- ఆస్పత్రికి తరలించిన పోలీసులు

జగిత్యాలక్రైం: మాయమాటలు చెప్పి అవసరం నిమిత్తం బంగారం, నగదు తీసుకున్న ఇద్దరు మహిళలు ఇప్పుడు అప్పుడు అంటూ తిప్పుకుంటుండడంతో మనస్తాపానికి గురైన ఓ వృద్ధురాలు జగిత్యాల పట్టణ పోలీస్‌స్టేషన్ ఆవరణలో క్రిమిసంహారక మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. పెగడపల్లి మండలం రాములపల్లికి చెందిన తోట బాలవ్వ వద్ద జగిత్యాలకు చెందిన అశ్విని, మల్యాల మండలం రామన్నపేటకు చెందిన విజయ ఇద్దరూ కలిసి తమ అవసరం నిమిత్తం 14 నెలల క్రితం 15 తులాల బంగారం, రూ.10 లక్షలు తీసుకుని ప్రామిసరీ నోట్ రాసి ఇచ్చారు. కాలపరిమితి ముగియడంతో బాలవ్వ డబ్బులు చెల్లించాలని కోరగా వారు నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారు. దీంతో గతంలోనే బాలవ్వ పోలీసులను ఆశ్రయించింది. పోలీసుల ముందు కూడా వారు డబ్బులు చెల్లిస్తామని ఒప్పుకున్నారు. బుధవారం డబ్బులు చెల్లించేందుకు వాయిదా ఉండటంతో బాలవ్వ పట్టణ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుంది. పోలీసులు అశ్విని, విజయను పిలిపించారు. వారు డబ్బులు చెల్లించేందుకు కొంతసమయం కావాలని, ఇప్పుడే కావాలంటే తమ వద్ద లేవని నిరాకరించడంతో మనస్తాపానికి గురైన బాలవ్వ వెంట తెచ్చుకున్న క్రిమిసంహారక మందు తాగింది. అక్కడున్న వారు గమనించి బాలవ్వను జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. ప్రస్తుతం బాలవ్వ చికిత్స పొందుతోంది.


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలవ్వ

వేటగాడి నిప్పు.. చెట్టుకు ముప్పు

బోయినపల్లి(చొప్పదండి): వన్యప్రాణుల కోసం ఓ వేటగాడు భారీ వృక్షం మొదట్లో నిప్పుపెట్టగా.. అది నేలకొరిగింది. పెద్ద ఎత్తున మంటలు చెలరేగగా ఫైర్ సిబ్బంది చేరుకొని మంటలు ఆర్పివేశారు. బోయినపల్లి మండలం తడగొండ నుంచి గంగాధర వెళ్లే మార్గంలో ఓ పెద్దచెట్టు మొదలుకు ఓ వేటగాడు రెండు రోజుల క్రితం నిప్పుపెట్టాడు. చెట్టు బొర్రెలో దాగి ఉన్న వన్యప్రాణుల కోసం మొదట్లో నిప్పు పెట్టాడు. పెద్ద ఎత్తున మంటలు లేవడంతో చెట్టు కూలిపోయి రోడ్డుపై పడింది. అయినా మంటలు తీవ్రంగా ఉండడంతో సమీప పొలాల్లోని రైతులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలు ఆర్పివేశారు. అనంతరం చెట్టును తొలగించారు.


చెట్టును తొలగిస్తున్న ఫైర్ సిబ్బంది

జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపిక


జాహ్నవి

వేములవాడ: సివిల్ జడ్జి(జూనియర్ బెంచ్) పరీక్షల్లో వేములవాడకు చెందిన సంకెపల్లి జాహ్నవి అర్హత సాధించారు. పట్టణంలోని భీమేశ్వరాలయం వీధికి చెందిన ఎస్.హరికిషన్ కూతురు జాహ్నవి ఉస్మానియా యూనివర్సిటీలో బీకాం ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం పూర్తి చేశారు. ప్రస్తుతం న్యాయశాస్త్రంలో పీహెచ్‌డీ చేస్తున్నా రు. నాలుగో ప్రయత్నంలో జడ్జిగా అర్హత సాధించారు.

కంప్యూటర్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

- కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్‌అర్బన్: సమ్మర్ క్యాంపులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కంప్యూటర్ రంగంలో ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కలెక్టరేట్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ ప్రాంతీయ శిక్షణ కేంద్రంలో శిక్షణ తరగతులను ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో చదివే విద్యార్థులు వేసవి సెలవుల్లో విభిన్న రంగాల్లో నైపుణ్యం సాధించాలనే ఉద్దేశంతో ఈ శిక్షణ ప్రారంభించినట్లు వివరించారు. నాలుగు వారాలపాటు జరిగే శిక్షణలో 50 మంది విద్యార్థులకు బేసిక్స్ ఆఫ్ కంప్యూటర్, ఫొటోషాప్ స్కిల్‌లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఉదయం, సాయంత్రం 25 మంది చొప్పున విద్యార్థులకు థియరీతోపాటు ప్రాక్టికల్ ట్రైనింగ్ ఇస్తామని పేర్కొన్నారు. ప్రతీ విద్యార్థి రోజూ ఒక పేజీ చేతి రాత ప్రాక్టీస్ చేయాలని అన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్, నెహ్రూ యువకేంద్ర కోఆర్డినేటర్, ప్రాంతీయ శిక్షణ కేంద్రం మేనేజర్ రాంబాబు, క్వాలిటీ కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, కేజీబీవీ కోఆర్డినేటర్ కృపారాణి, సంతోష్ పాల్గొన్నారు.

నర్సింగ్ విద్యార్థులకు నివాళి


నివాళి అర్పిస్తున్న వైస్ ప్రిన్సిపాల్ సుశీల, విద్యార్థులు

కోల్‌సిటీ(రామగుండం): జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో ఇద్దరు నర్సింగ్ విద్యార్థినులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమని రామగుండం ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ పల్లె సుశీల ఆవేదన వ్యక్తం చేశారు. మృతి చెందిన నర్సింగ్ విద్యార్థినులు మహేశ్వరి, మనీషశ్రీ చిత్రపటాలకు గోదావరిఖని శారదానగర్‌లోని నర్సింగ్ కాలేజీలో బుధవారం పూలమాలలు వేసి, కొవ్వొత్తులు వెలిగించి నివాళి అర్పించారు. నర్సింగ్ కాలేజీ నుంచి హాస్టల్‌కు వెళ్లేందుకు రోడ్డు పక్కన నిల్చున్న విద్యార్థినులను వాహనం ఢీకొనగా ఇద్దరూ మృతి చెందారని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్యాకల్టీలు స్వాతి, ప్రియాంక, సంధ్య, భావన, ఉషా, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

8లోగా దరఖాస్తు చేయాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అరుణశ్రీ


పెద్దపల్లిరూరల్: జిల్లాలోని మున్సిపాలిటీల రికార్డులను ఆడిట్ చేసేందుకు ఆసక్తిగల ఆడిటర్లు ఈనెల 8లోగా దరఖాస్తు చేయాలని స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ తెలిపారు. జిల్లాలోని రామగుండం నగరపాలక సంస్థతోపాటు పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని మున్సిపాలిటీల్లో ఏరియా లెవెల్ ఫెడరేషన్, టౌన్ లెవల్ ఫెడరేషన్‌కు సంబంధించిన రికార్డులను ఆడిట్ చేయాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి, అర్హత, అనుభవం గల ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ఆడిటర్ల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. దరఖాస్తులను మెప్మా కార్యాలయంలో ఈనెల 8లోగా అందించాలన్నారు. వివరాలకు 63048 94940 నంబరులో సంప్రదించాలని అదనపు కలెక్టర సూచించారు.

ఆర్టీసీ బస్సులో పొగలు


మల్లాపూర్ శివారులో ఓవర్ హీట్‌తో నిలిచిన ఆర్టీసీ బస్సు

మల్లాపూర్: అసలే ఎండాకాలం.. ఆపై 120 మంది ప్రయాణికులు.. ఓవర్ హీట్‌తో ఇంజిన్ నుంచి పొగలు రావడంతో ఓ ఆర్టీసీ బస్సు నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సంఘటన మల్లాపూర్ మండల కేంద్రం శివారులో బుధవారం చోటుచేసుకుంది. జగిత్యాల డిపోకు చెందిన బస్సు నిర్మల్‌కు బయల్దేరింది. అందులో సుమారు 120మంది ప్రయాణికులు ఎక్కారు. మల్లాపూర్ శివారుకు చేరగానే ఒక్కసారిగా ఇంజిన్ నుంచి పొగలు రావడంతో డ్రైవర్ వెంటనే బస్సును నిలిపివేశాడు. మరో బస్సు వచ్చేవరకూ ప్రయాణికులు ఎండలోనే వేచి ఉండి ఇబ్బందిపడ్డారు.

పుట్టెడు దుఃఖంలోనూ ఉత్తమ ఫలితం


శశివర్ధన్

రుద్రంగి(వేములవాడ): రుద్రంగి మండల కేంద్రానికి చెందిన బోనగిరి శశివర్ధన్ పదో తరగతి పరీక్షలు రాస్తున్న సమయంలో తన చిన్నబాపు బోనగిరి లక్ష్మీరాజం గుండెపోటుతో మృతిచెందాడు. పుట్టెడు దుఃఖంలోనూ తరగతి పరీక్షలు రాసిన శశివర్ధన్ బుధవారం వెలువడిన ఫలితాల్లో ఉత్తమ 521 మార్కులు సాధించాడు. రుద్రంగి జెడ్పీ హైస్కూల్ టాపర్‌గా నిలిచాడు. విద్యార్థి శశివర్ధన్‌ను జెడ్పీ హైస్కూల్ అధ్యాపకబృందం, ప్రజా ప్రతినిధులు అభినందించారు.

తహసీల్దార్ల బదిలీ

కరీంనగర్ అర్బన్: జిల్లాలో భారీగా తహసీల్దార్లను బదిలీ చేస్తూ కలెక్టర్ పమేలా సత్పతి ఉత్తర్వులు జారీ చేశారు. ఐదు మండలాలు మినహా అందరికీ స్థానచలనం కల్పించారు. కాగా ఓ తహసీల్దార్‌పై అవినీతి ఆరోపణలు రాగా నేరుగా ప్రజావాణిలో కలెక్టర్‌తో బాధితులు గోడు వెల్లబోసుకున్న విషయం తెలిసిందే. విచ్చలవిడి అవినీతితో పాటు వ్యక్తిగత కక్షలకు పాల్పడుతూ సర్టిఫికెట్ జారీలోనూ నియంతలా వ్యవహరిస్తున్నాడన్న ఆరోపణలు కోకొల్లలు. సదరు తహసీల్దార్‌కు స్థానచలనం లేకపోవడం విమర్శలకు తావిస్తోంది.

బదిలీ అయినవారి వివరాలు..

తహసీల్దార్ పేరు	ప్రస్తుతం	బదిలీ స్థానం
జె.నరేందర్	కరీంనగర్ అర్బన్	గన్నేరువరం
ఎన్.రాజేశ్	కొత్తపల్లి	కరీంనగర్‌రూరల్
కె.విజయ్‌కుమార్	తిమ్మాపూర్	మానకొండూరు
బి.రాజేశ్వరి	మానకొండూరు	రామడుగు
ఆర్.వెంకటలక్ష్మి	రామడుగు	కొత్తపల్లి
సీహెచ్.రాజు	కరీంనగర్‌రూరల్	జమ్మికుంట
జి.రమేశ్‌బాబు	జమ్మికుంట	శంకరపట్నం
బి.భాస్కర్	శంకరపట్నం	హుజూరాబాద్ (ఆర్డీవో ఆఫీస్)
కె.శ్రీనివాస్‌రెడ్డి	హుజూరాబాద్(ఆర్డీవో ఆఫీస్)	తిమ్మాపూర్
ఇ.నరేందర్	గన్నేరువరం	కరీంనగర్ అర్బన్
జి.మంజుల	సైదాపూర్	వీణవంక
జి.శ్రీనివాస్	వీణవంక	సైదాపూర్
ఎం.కాళిచరణ్	కలెక్టరేట్ (సీ సెక్షన్)	కలెక్టరేట్ (జీ సెక్షన్)
ఎస్.శ్రీవాణి	కలెక్టరేట్ (జీ సెక్షన్)	కలెక్టరేట్ (సీ సెక్షన్)